


# కరపత్రం

SINCE 2014

శనివారం మార్చి 22 2025 | సంపుటి :0 | సంచిక : 159 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## ఒక ప్రశ్నా పత్రానికి బదులు.. మరో ప్రశ్నా పత్రం

పదో తరగతి విద్యార్థులు షాక్.. రెండుగంటల సమయం వృథా విచారణకు ఆదేశించిన కలెక్టర్



2లో

## ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యం

అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మచ్చబోల్లారంకు చెందిన ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యం అయ్యారు. తమ కుమార్తెలు రెండు రోజుల నుంచి కనబడడం లేదని బాలికల తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. బాలికల పేరెంట్స్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇన్ స్టా గ్రామ్‌లో పరిచయమైన ఇద్దరు యువకులు బాలికలిద్దరితో కలసి ఓయో రూమ్‌లో గడిపినట్లు పోలీసులు గుర్తించారు. ఒకరు ఈసీఐఎల్, మరొకరు దమ్మాయి గూడకు చెందిన వారిగా సమాచారం. కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు ఈ నెల 11న హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక తనకు పరిచయమున్న 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కొద్ది రోజులకు పోలీసులు వెతికి పట్టుకున్నారు. భరోసా సెంటర్?కు తరలించి విచారించడంతో బాలిక ప్రెగ్నెంట్ అని తేలింది. నిందితుడిపై పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) కేసు నమోదు చేసి రిమాండ్?కు తరలించారు. అనంతరం బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ తరహా కేసులు గణనీయంగా పెరుగుతుండడం ప్రస్తుతం ఆందోళన కలిగిస్తోంది. పేజి 2లో




## విమైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వండి

ఆర్ఐడీఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు

నాబాదర్డ్ చైర్మన్‌ను కోరిన సిఎం రేవంత్




మైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాబార్డ్ చైర్మన్‌ను కోరారు. కో-ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలని, కొత్తగా మరిన్ని కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని నాబార్డు చైర్మన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శుక్రవారం నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీ భేటీ అయ్యారు. ఆర్ఐడీఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు అందించాలని నాబార్డు చైర్మన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. స్వయంసహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని సీఎం కోరారు. ఐకేపీ, గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి అడిగారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్స్ నిధులు మార్చ్ 31వ తేదీలోగా ఉపయోగించుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. నాబార్డు పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్స్ నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో కొన్ని డీసీసీబీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి నాబార్డు చైర్మన్ ప్రతిపాదించారు. ఈ సమావేశంలో నాబార్డు ప్రతినిధులతో పాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

## కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో పల్టీ

17మందికి గాయాలు.. 5గురి పరిస్థితి విషమం



2లో

కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో బోల్తాకొట్టడంతో 17మందికి గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం కూలీలతో వెళ్తున్న ఆటోను పెద్దనాగారం స్టేజి సమీపంలో ఓ లారీ ఢీకొట్టింది. దీంతో 17 మంది గాయపడ్డారు.

## 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు

బెట్టింగ్ ప్రమోషన్‌లో దూకుడుపెంచిన పోలీసులు

108 బెట్టింగ్ యాప్స్ బ్లాక్



2లో

## రోడ్లపై హరీష్ రావు గొప్పలు

బిఆర్ఎస్ హయాంలో గ్రామాలకు పెద్ద ఎత్తున రోడ్లు

వికారాబాద్ జిల్లాలో రోడ్లు లేక పిల్లను ఇవ్వడం లేదన్న స్పీకర్

దిమ్మతిరిగి షాక్‌కు గురైన హరీష్ రావు

గజ్వేల్, సిద్ధిపేట, సిరిసిల్లలకే రోడ్లు వేశారన్న కోమటిరెడ్డి

వికారాబాద్ జిల్లాలో రోడ్లు లేక, గ్రామాల్లో పిల్లలు ఇవ్వలేని దస్థితి ఉందని స్పీకర్ ప్రసాదరావు ముక్తసరిగా చేసిన వ్యాఖ్య..బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్ల గురించి మాట్లాడిన హరీష్ రావుకు షాక్ తగిలినట్లు అయ్యింది. బడ్జెట్ చర్చలో హరీష్ రావు మాట్లాడుతూ..బిఆర్ఎస్ హయాంలో ప్రతి గ్రామానికి, మండలానికి రోడ్డుల వేశామని అన్నారు.



2లో

## బడ్జెట్‌పై చర్చలో పరస్పర విమర్శలు

హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు




2లో

## బెట్టింగ్ యాప్ కేసు కొట్టేయండి: శ్యామల



2లో

# సంపాదకీయం

## ఇరవై రెండు భాషలకూ అధికార హోదా

భారత గణతంత్ర రాజ్య అధికార భాషగా హిందీ! ఇంకెంతకాలం ఈ ప్రహసనం? జరూరుగా ముగించేద్దాం. ఈ పరిత్యజనం వల్ల హిందీ ప్రాభవానికి ఎటువంటి హాని సంభవించదు. నిరంతరం బాల రాజు హోదాలో ఉండడం వల్ల హిందీకి మేలు జరగదుబీ దేశ శ్రేయస్సుకూ తోడ్పడదు. ఈ హోదా తగ్గింపు హిందీని వివిధ భారతీయ భాషలతో సమస్థాయిలో కలుపుతుంది. నష్టమేమిటి? దానివల్ల అసలు భాషా వివక్షకు కారణమైన ఆంగ్ల భాషా సామ్రాజ్యవాదంపై తీవ్ర చర్చను నిరోధిస్తున్న 'హిందీ విధింపు' అన్న భావావేశాల దారి మళ్లింపు వ్యవహారం అన్న అడ్డు తొలగిపోతుంది. ఇది, భావాలలో స్వరాజ్యం దిశగా ఒక గొప్ప ముందడుగు అవుతుందేమో! హిందీ భాష విషయమై గత 75 సంవత్సరాలుగా అనుసరిస్తున్న విధానం ఆశించిన లక్ష్యాలను నెరవేర్చకపోగా ప్రతికూల ఫలితాలను మాత్రమే ఇస్తోంది. మాట్లాడే ప్రజల సంఖ్య అత్యధికంగా ఉన్న కారణంగా భారతీయ భాషా ప్రపంచ వైవిధ్యంలో హిందీకి ఒక ప్రత్యేక స్థానమున్నది. జనాభా గణన ప్రక్రియలో హిందీ భాష మాట్లాడేవారుగా వర్గీకృతమైన జనుల సంఖ్య 60 కోట్లకు (దేశ జనాభాలో 42 శాతంకు) పైగా ఉన్నది.

ప్రపంచంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాషలలో హిందీ నాల్గవ స్థానంలో ఉన్నది. మరే ఇతర భారతీయ భాషకు ఇటువంటి ప్రాధాన్యం లేదు, పొందలేదు కూడా. బహు భాషామయమైన మన జాతి జీవితంలో హిందీ ఒక వారధిగా ఉపయోగపడగలదు. అయితే తనలో అంతర్గతం చేసుకున్న బహు భాషల మూలాలను, ఇతర భారతీయ భాషలకు విస్తరించిన తన ప్రభావాన్ని నిలుపుకుని అభివృద్ధిపరచుకోగలిగితే హిందీ ఒక వారధి భాషగా తప్పకుండా వెలుగొందుతుంది. భారతీయ భాషా జగత్తులో అత్యున్నత హోదాను ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరి నుంచి గౌరవాదరాలను అపేక్షించే 'శుద్ధ' హిందీ అంతిమంగా మతతత్వానికి ఆలంబన అవుతుంది. సాంస్కృతిక విభేదాలను పెంచి, జాతీయ సమైక్యతను బలహీనపరుస్తుంది. హిందీకి అధికార భాష హోదా దానికి మేలు చేయకపోగా హాని మాత్రమే చేసింది. తనలో అంతర్గతం చేసుకున్న భాషలకు సవతి తల్లిగాను, ఇతర భారతీయ భాషలకు అత్తగారుగాను పరిణమించింది. అటూ ఇటూ ఎవరి నుంచి గౌరవాన్ని పొందలేకపోతోంది. దీనికి తోడు ఇప్పుడు హిందీని దేశవ్యాప్తంగా అధికార భాషగా చేసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలతో పరిస్థితులు మరింతగా విషమించాయి. ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయుడు రఘువీర్ సహాయ్ తన 'హమారి హిందీ' అన్న కవితలో భార్యను కోల్పోయిన సంపన్న వృద్ధుడి కొత్త, పడుచు భార్యగా పోల్చాడు! ఆయన ఆ పద్యం ఆరు దశాబ్దాల క్రితం రాశారు. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. ఏమైనా మార్పు ఉంటే అది ఆంగ్ల భాష తన స్థానాన్ని మరింతగా బలోపేతం చేసుకోవడమే.

హిందీ భాష మాట్లాడే ప్రజలు అందరూ తమ బిడ్డలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో చేర్పించేందుకే ఆరాటపడుతున్నారు. హిందీ రాష్ట్రాలలోని మధ్యతరగతి' విద్యావంతులలో ఎంతమంది హిందీ దినపత్రికను చదువుతున్నారు? ఇంట వారు మాట్లాడే భాష అటు హిందీనూ కాదు, ఇటు ఆంగ్లమూ కాదు. రెండిటి మిశ్రమం. అదొక సంకర భాష. ఆంగ్లంతో సరిచూసినప్పుడు హిందీ ఎంత అప్రధానంగా ఉంటుందో నిత్య సామాజిక జీవితంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సులకు హిందీ దినపత్రికల నిండా వాణిజ్య ప్రకటనలే. తల్లిదండ్రులు తమ బిడ్డలను అతిథులకు వచ్చీరాని ఆంగ్లంలో పరిచయం చేస్తుంటారు. యువజనులు తమ స్నేహితుడు లేదా స్నేహితురాలును ఆకట్టుకునేందుకు వచ్చీరాని ఆంగ్లంలో వింతగా మాట్లాడుతుంటారు! ఆంగ్లానికి విలువ పెరుగుతోంది. హిందీకి ఆదరణ తగ్గుతోంది. ప్రపంచపు నాల్గవ అతి పెద్ద భాషను దానిని మాట్లాడే రాష్ట్రాలలోనే బోధించడం సాధ్యం కావడం లేదు. ఇక హిందీని నేర్చుకోవాలని ఇతరులను ఎలా బలవంతపెట్టడం? హిందీ మాతృభాషగా ఉన్న ఐదవ తరగతి గ్రామీణ విద్యార్థులలో రెండవ తరగతి హిందీ పాఠ్యగ్రంథంలోని పాఠాలను ఒక పేరా కూడా తప్పులు లేకుండా చదవలేకపోతున్నారని అసర్ సర్వే వెల్లడించింది. హిందీ మాధ్యమంలో కళాశాల విద్యను అభ్యసించిన పట్టభద్రులు వ్యాకరణ యుక్త హిందీని రాయలేకపోతున్నారు. వారి హిందీ పదాల అక్షర క్రమం కూడా సరిగ్గా ఉండదు. మరీ ముఖ్యంగా హిందీ భాష ఒక మేధో సంస్కృతిని సృష్టించనేలేదు.

ప్రపంచ స్థాయి ఉత్తమ సాహిత్యాన్ని హిందీ రచయితలు సృజిస్తున్నారు. అయితే హిందీ రాష్ట్రాల ప్రజానీకంలో ఎంత మంది సమకాలీన మహా రచయిత వినోద్ కుమార్ శుక్లా పేరును గుర్తుపట్టగలరు? అసాధారణ పాత్రికేయులు ఉన్నారు. అయితే ఉత్తమ, ఉత్కృష్ట పాత్రికేయానికి ఆలంబనగా ఉన్న వార్తా పత్రిక ఒక్కటీ లేదు కదా. అధునాతన వైజ్ఞానిక, సాంకేతిక, సామాజిక శాస్త్రాల విషయం అటుంచండి, ఏ విద్యా విభాగంలోను లక్షలాది విద్యార్థుల అవసరాలను తీర్చే పాఠ్య గ్రంథాలు లేనే లేవు. మరి హిందీ మాధ్యమంలో ఉన్నత విద్యాభ్యాసం వల్ల ప్రయోజనమేముంది? నవీన భావాల వ్యాప్తికి దోహదం చేసిన చివరి హిందీ మ్యాగజైన్ దిన్ మాన్ (కాకతాళీయంగా దీనికి ఎడిటర్ రఘువీర్ సహాయ్) యాభై సంవత్సరాల క్రితమే మూతపడింది. పాఠశాలలో హిందీలో మాట్లాడితే బాలలకు జరిమానా విధించే పరిస్థితులు ఉన్న దేశం మనది. మరి హిందీ ఆధిపత్యం గురించి మాట్లాడడం ఒక క్రూర పరిహాసమే సుమా! ఆధిపత్యంలో ప్రభావశీల నియంత్రణ, సాంస్కృతిక న్యాయబద్ధత అంతర్గతంగా ఉంటాయి. హిందీకి ఇవేవీ లేవు. భారతీయ పాలకవర్గాల భాష ఇంగ్లీష్. దానికి సాంస్కృతిక ప్రాబల్యమున్నది. ఆర్థిక వనరులు ఉన్నాయి. శక్తిమంతమైన విద్యా సంబంధిత పరిశ్రమ మద్దతు ఉన్నది. ఆ భాష ఎవరి మీదైతే పెత్తనం చేస్తుందో వారు దానిని రక్తగతం చేసుకున్నారు. సాంస్కృతిక అధిపత్యమంటే ఇదే కదా? హిందీ భాషా దురభిమానులు ఎంతగా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నా హిందీని హీందీయేతర భాషల వారిపై రష్యన్ భాషను, సోవియట్ యూనియన్‌లో రష్యన్ భాషను, రష్యనేతర ప్రజలపై రుద్దినట్టు రుద్దలేదు. భారతీయ భాషా వైవిధ్యాన్ని గౌరవించడం వల్లే భారత గణతంత్ర రాజ్యం సమైక్యంగా మనగలుగుతోంది. అయితే హిందీ విధింపు అన్న ఆరోపణలో నిజం లేకపోలేదు అధికార భాషగా హిందీని ప్రోత్సహించడం దాని సాధికారతకు చేసిన మేలు ఏమీ లేదు. బిల్ బోర్డులు, నేమ్ బోర్డులు హిందీలోనే ఉండాలనడం హిందీయేతర భాషల వారికి ఆగ్రహం కలిగిస్తోంది. భారత ప్రభుత్వం కొత్త పథకాలకు, కార్యక్రమాలకు, చట్టాలకు కూడా హిందీ లేదా సంస్కృతంలో పేర్లు పెట్టడం హిందీయేతర భాషల వారికి చిరాకు కలిగిస్తోంది. దీనికి తోడు హిందీ భాషీయులు తమది 'జాతీయ భాష' అని ఎల్ల వేళలా ఘోషించడం ఆ భాష పట్ల వ్యతిరేకతను మాత్రమే పెంచుతోంది. హిందీ 'జాతీయ భాష' అనేందుకు ఎలాంటి చట్టబద్ధత గానీ, రాజ్యాంగ బద్ధత గానీ లేదు కదా. కేవలం ప్రభుత్వ కార్యాలయాలలో మాత్రమే అది అధికార భాషగా పరిగణింపబడుతోంది. దీని పర్యవసానాలు పూర్తిగా ప్రతికూలంగా ఉంటున్నాయి. ఈ వాస్తవాల దృష్ట్యా నేను ఒక ప్రతిపాదన చేస్తున్నాను. రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూలులోని 22 భాషలకు అధికార భాష హోదా కల్పించాలి. మనకు ఒక జాతీయ అధికారిక, లేదా అనుసంధాన భాష అవసరం లేదు. సెప్టెంబర్ 14ను హిందీ దినోత్సవంగా కాకుండా భారతీయ భాషలు అన్నిటినీ గౌరవించేందుకు భాషా దినోత్సవంగా నిర్వహించాలి. హిందీని ప్రోత్సహించేందుకు శత విధాల చేస్తున్న ప్రయత్నాలు అన్నిటినీ భారత ప్రభుత్వం నిలిపివేయాలి. అనుసంధాన భాష అవసరమైనవారు దానిని తమకు తామే ఎంపిక చేసుకోవాలి.

అనుసంధాన భాషగా గౌరవం పొందాలని హిందీ ఆశిస్తుంటే ఇతర భాషలతో సంకరమయ్యేందుకు సిద్ధమవ్వాలి. 'సరైన' హిందీని నిర్ణయించి నమోదు చేసేందుకు ఒకటి గాక బహుళ సంస్థలను అనుమతించాలి. హిందీని ప్రమోట్ చేయడానికి బదులు భారతీయ భాషలను ప్రోత్సహించడం, అభివృద్ధిపరచడమమే జాతీయ లక్ష్యంగా ఔదలదాల్చాలి. 'ఇంగ్లీష్‌ను బహిష్కరించాలి' అన్న ఒకనాటి లోహియా నినాదం ఇంకెంత మాత్రం పనిచేయదు. 'భాషలను అభివృద్ధిపరచడమే' మన ఉద్ఘోష కావాలి. ఉద్యమ ఉద్వేగంతో, సంకల్ప శుద్ధితో ఈ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి. మొత్తం 22 భాషలలోను ఉన్నత విద్యకు అవసరమైన పుస్తకాలు అన్నిటినీ అనువాదం చేసుకోవాలి. బాలసాహిత్యాన్ని పునః సృజించుకోవాలి. ఇందుకు అవసరమైన ఆర్థిక వనరులు ప్రభుత్వం సమకూర్చాలి. దీనితో పాటు 'మాండలికాలు'గా మాత్రమే పరిగణన పొందుతూ, ఎనిమిదో షెడ్యూలులో లేని కనీసం 100 భాషలను కాపాడేందుకు అవసరమైన సంస్థలను ఏర్పాటు చేసి వాటికి అన్ని విధాల మద్దతునివ్వాలి. ప్రతి ఒక్కరికీ మాతృభాషలో విద్య సమకూర్చాలనే విద్యాహక్కు నిర్దేశాన్ని అమలుపరిచేందుకు చిత్తశుద్ధితో పూనుకోవాలి. హిందీ ప్రజల భాష. అది అలా ఉండిపోవడమే దానికి అన్ని విధాల మేలు.

# బడ్జెట్‌పై చర్చలో పరస్పర విమర్శలు

మొదటిపేజీ తరువాయి

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా విమర్శలు, ప్రతి విమర్శలు, సవాళ్లతో అసెంబ్లీ దద్దరిల్లింది. బడ్జెట్ చర్చలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన విమర్శలపై అధికార పార్టీ సభ్యులు ఘాటుగా సమర్పించారు. సిఎం భాషపై హరీష్ రావు ప్రతి విమర్శలు చేశారు. దీంతో సభలో లేని నాయకుడిపై విమర్శలు చేయడం సరికాదని స్పీకర్ ప్రసాదరావు సూచించారు. ఒకానొక సందర్భంలో చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం దారుణమని మంత్రి శ్రీధర్ బాబు ఎదురుదాడి చేశారు. బిఆర్ఎస్ హయాంలో తమకు కనీసం ఐదు నిముషాలు కూడా మాట్లాడనిచ్చేవారు కాదని, ఇప్పటికే హరీష్ రావు రెండుగంటలకు పైగా మాట్లాడారని అన్నారు. సభా నాయకుడిని పట్టుకొని అజ్ఞానం అని మాట్లాడడం సరికాదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హితవు పలికారు. కాంగ్రెస్ వారికి బుద్ధిమాంద్యం ఉందని మాట్లాడడం సరికాదని, విజ్ఞులైతే స్పీకర్ చెప్పింది విని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై శాసన సభలో సాధారణ చర్చ సందర్భంగా హరీష్ రావుకు భట్టి కౌంటర్ ఇచ్చారు. 'సభాపతితో కూడా వాగ్వాదం చేయడం సరికాదు, మాకు బుద్ధి ఉందో మీకు ఉందో లెక్కలు వేసుకుని చెబుతాం, సభా నాయకుడు, ప్రభుత్వ పెద్దల గురించి సరైన భాష వాడాలని సూచించారు. బడ్జెట్ పరిధి దాటి అడ్డగోలుగా మాట్లాడడం సబబుకాదని భట్టి హెచ్చరించారు. ఇకపోతే అదేపనిగా కెసిఆర్‌ను విమర్శించడం మాని పాలనపై దృష్టి పెట్టాలని హరీష్ రావు అన్నారు. భారాస హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.4.22 లక్షల కోట్లు అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని పదే పదే చెప్పవద్దని.. భారాసపై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపొద్దని కోరారు. ఇది అవాస్తవిక బడ్జెట్.. గాలి మేడల బడ్జెట్ అని తీవ్రంగా విమర్శించారు.కృష్ణా నదీ జలాలపై ఈ బడ్జెట్‌లోనే చర్చ పెట్టాలి. మీ నిర్వాకం వల్ల ఈ ఏడాది 34 శాతం వాడాల్సిన నీళ్లలో.. 24 శాతమే వాడారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయి. నీటిని రాబట్టడంలో ప్రభుత్వం ఎలా విఫలమైందో చర్చించాలి. తెలంగాణకు వరంగా ఉన్న సెక్షన్3ని భారాస సాధించింది. ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలి. తెలంగాణకు న్యాయబద్ధమైన 575 టీ-ఎంసీలను రాబట్టాలని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ అప్పు రూ.8.6 లక్షల కోట్లు-గా ఉందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రోజుకు రూ.1700 కోట్లకుపైగా కాంగ్రెస్ సర్కారు అప్పు చేస్తోందని విమర్శించారు. బడ్జెట్‌పై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిమిషానికి రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ.2.27 లక్షలుగా ఉంది. పెద్ద ఎత్తున రుణాలుంటే తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలి. యూపీఏ కంటే ఎన్డీఏ హయాంలో ఆర్థిక సంఘం నిధులు పెరిగాయి. యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేది. అప్పుడు కేంద్ర పన్నుల్లో వాటా 2-3 శాతం కూడా పెంచలేదు. మోదీ ప్రభుత్వం వచ్చాక కేంద్ర పన్నుల్లో వాటా 10 శాతం పెంచి 42 శాతం చేశారు. పన్నుల్లో వాటా పెంచాక కూడా కేంద్రాన్ని విమర్శించడం సరికాదని ఆయన అన్నారు.

# బెట్టింగ్ యాప్ కేసు కొట్టేయండి: శ్యామల

మొదటిపేజీ తరువాయి


బెట్టింగ్ యాప్‌ల కేసులో యాంకర్ శ్యామల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బెట్టింగ్ యాప్ కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని పిటిషన్ వేశారు. దీనిపై కోర్టులో విచారణ జరగనుంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో శ్యామలపై కేసు నమోదైన విషయం తెలిసిందే.సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో టీ-వీ యాంకర్ విష్ణుప్రియ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ రీతూచౌదరిలను పంజాగుట్ట పోలీసులు నిన్న సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే.

## ఉద్యోగాల భర్తీకి తక్షణ నోటిఫికేషన్లు

### ఓయూలో తెలంగాణ జెఎసి ఆందోళన

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మెయిన్ లైబ్రరీ ఎదుట నిర్వహించిన నిరసన అనంతరం జేఏసీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా చట్టబద్ధమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో హామీ ఇచ్చిన ప్రకారం ఇప్పటివరకు 13 ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. నోటిఫికేషన్లు ఇంకా విడుదల చేయొద్దని నిరుద్యోగులు కోరుతున్నారని డిప్యూటీ- సీఎం బట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సంవత్సరానికి రెండున్నర లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు . నోటిఫికేషన్లు విడుదల చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వచ్చేనెల 1వ తేదీ లోపు నోటిఫికేషన్లు విడుదల చేయకపోతే వచ్చే నెలలో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిరుద్యోగులతో భారీ సింహగర్జన నిర్వహించనున్నట్లు- తెలిపారు. అప్పటికి స్పందించకపోతే ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ అంశంపై చర్చించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు.

## ప్రజాప్రతినిధులపై కేసులపై హైకోర్టు విచారణ



ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అంశంపై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారించింది. మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రయోప్రయోజన వ్యాజ్యాన్ని కలిపి విచారణ జరిపింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను వేగంగా విచారించాలని హరిరామజోగయ్య గతంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణలోని వివిధ కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 309కి పైగా కేసులున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. విచారణలో పురోగతిపై కౌంటర్ దాఖలకు సమయం కోరారు. విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు ఆదేశించిందని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది తెలిపారు. మార్చి 31వరకు ఉన్న కేసుల పురోగతి తెలపాలని ఏఏజీకి ఆదేశించిన ప్రత్యేక ధర్మాసనం.. అందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది.

## ఒక ప్రశ్నా పత్రానికి బదులు..

# మరో ప్రశ్నా పత్రం

మొదటిపేజీ తరువాయి

అధికారుల నిర్లక్ష్యంతో మెయిన్ పరీక్షల్లో కొన్నిసార్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈక్రమంలో పదోతరగతి పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఎగ్జామ్‌సెంటర్ పరీక్ష రాయటానికి కూర్చున్న విద్యార్థులకు ఒక ప్రశ్నా పత్రానికి బదులు మరో ప్రశ్నాపత్రాన్ని ఇవ్వడంతో విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. మంచిర్యాల జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. ఉదయం విద్యార్థులంతా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష హాల్లో తమకు కేటాయించిన సీట్లలో కూర్చుకున్నారు. పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యాయి. అక్కడి ఇన్విజిలేటర్లు ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారు. అయితే ఆ ప్రశ్నాపత్రాన్ని చూసి విద్యార్థులంతా అవాక్కయ్యారు. ఏంటిది అంటూ ఒకింత భయాందోళనకు గురయ్యారు. ఒక ప్రశ్నాపత్రానికి బదులుగా మరో పేపర్‌ను అధికారులు పంపిణీ చేశారు. విద్యార్థులు దాన్ని గుర్తించి చెప్పడంతో అధికారులు హైరానా పడ్డారు. హడావుడిగా మరో పేపర్ తెప్పించడంతో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా విద్యార్థులు పరీక్ష రాశారు. అయితే ప్రశ్నాపత్రం తారుమారైన విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో ప్రశ్నాపత్రాల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం, పరీక్ష ఆలస్యంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఒక ప్రశ్నాపత్రం బదులు మరో పేపర్ రావడంతో వెంటనే విచారణ జరిపి నివేదిక అందించాల్సిందిగా డీఈవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాల విషయంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యం

మొదటిపేజీ తరువాయి

తెలిసీ తెలియని వయసులో ప్రేమ పేరుతో ఆడపిల్లలు తల్లిదండ్రులకు దూరమవుతున్నారు. వీరిలో చాలా మందిని పోలీసులే గుర్తిస్తున్నారు. మరికొందరు వారంతటవారే ఇంటికి వచ్చేస్తున్నారు. మరికొంతమంది అయితే తిరిగి రావడానికి భయపడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు ప్రతి రోజూ వార్తల్లో చూస్తున్నాం. యువతులు తమకు సన్నిహితంగా మెలిగే వారితో ఆకర్షణకు లోనవడం.. ప్రేమ పేరుతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు.

# కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో పల్టీ

మొదటిపేజీ తరువాయి

వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండగా, మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన 14 మంది, ఫతేపుర గ్రామానికి చెందిన ముగ్గురు మొత్తం 17 మంది మహిళా కూలీలు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలంలో మిర్చి ఏరడానికి ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్దనాగారం స్టేజీ సమీపంలోని ఇటుకల బట్టి వద్ద ఎదురుగా వస్తున్న లారీ.. ఆటోను ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన ఆటో రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. అందులో ఉన్నవారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మూడు అంబులెన్సుల్లో మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. గాయపడినవారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వెల్లడించారు. వారిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు.

# 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలో పోలీసులు దూకుడుగా ముందుకెళ్తున్నారు. బెట్టింగ్ యాప్స్ యజమానులే టార్గెట్‌గా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే బెట్టింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధితుల వివరాలు సేకరించారు. బెట్టింగ్ ఊబిలో చిక్కుకుని ఒక్క ఏడాదిలో 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తెలంగాణ వ్యాప్తంగా 15 కేసులు నమోదు చేశారు. ఆయా బెట్టింగ్ యాప్స్ గుర్తించే పనిలో పడ్డారు పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, ప్రమోటర్లను నిందితులుగా చేర్చనున్నారు. అయితే బెట్టింగ్ యాప్స్ కేసులపై పోలీస్‌శాఖ లీగల్ ఒపీనియన్‌కు వెళ్లబోతుంది. స్కిల్ బేస్డ్ గేమ్స్‌కి మాత్రమే ప్రకటనలు చేశామంటున్నారు విజయ్, రానా. అయితే సెలబ్రిటీల నుంచి కీలక అంశాలు రాబట్టిన పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులపైన ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకు 108 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు బ్లాక్ చేశారు. మరో 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు ఇచ్చారు. బెట్టింగ్ వెబ్‌సైట్లు తెలంగాణలో యాక్సెస్ కాకుండా. జియో-ఫెన్సింగ్ టెక్నాలజీతో చర్యలు తీసుకుంటోంది. కాగా బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో ఇప్పటికే విష్ణుప్రియ, రీతూచౌదరి, తేస్టీ తేజ, కిరణ్‌గౌడ్‌లను పోలీసులు విచారించారు. శ్యామల, అజయ్ సన్నీ, సుప్రీత, సన్నీ సుధీర్‌లను విచారణ కోసం సంప్రదించగా వారి ఫోన్లు స్విచాఫ్ వచ్చినట్లు సమాచారం. అలాగే మరికొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. విచారణ భయంతో హర్షసాయి, ఇమ్రాన్, భయ్యా సన్నీయాదవ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌తో సినీనటులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు భారీగా లబ్ధి పొందారని, అసలు వారికి ఏయే మార్గాల్లో డబ్బు వచ్చిందని పోలీసులు ఆరా తీస్తున్నారు.

# రోడ్లపై హరీష్ రావు గొప్పలు

మొదటిపేజీ తరువాయి

తమ ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు అధికంగా ఖర్చుచేసిందని అన్నారు. దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీటుగా జవాబిచ్చారు. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దపేట తప్ప రాష్ట్రంలో ఎక్కడా రోడ్లు వేయలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో వేసినవే తప్ప పదేళ్లలో ఎక్కడా లేవన్నారు. అలాగే ఈ మూడు నియోజకవర్గాల కోసం అన్ని నిధులను వాడారని దుయ్యబట్టారు. ఇదే సందర్భంలో స్పీకర్ ప్రసాదరావు జోక్యం చేసుకుని..వికారబాద్ జిల్లాలో రోడ్లులేక పిల్లలకు పెళ్లిళ్లు కావడం లేదని ముక్తసరిగా అన్నారు. ఈంతో హరీష్ రావుకు దిమ్మతిరిగినంత పనయ్యింది. రోడ్లపై మరోరోజు చర్చకు సిద్దమని చెప్పి తప్పించుకున్నారు. అంతకుముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ విధించే ఆలోచన లేదని తెలిపారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వారికి ఆరు నెలలు లేదా మూడు నెలలకు చెల్లిస్తామన్నారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్ రోడ్లు వేయిస్తామని తెలిపారు. భారాస హయాంలో సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కే రోడ్లు వేశారని చెప్పారు. ఆ మూడు చోట్ల రోడ్లకు చివరికి సింగరేణి నిధులు కూడా వాడారని పేర్కొన్నారు. ఛాలెంజ్ చేస్తున్నా.. రాష్ట్రమంతా తిరిగి చూద్దామా అని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. కోమటిరెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. భారాస హయాంలో ఆర్అండ్‌బీ పనుల గురించి లెక్కలు తీద్దామన్నారు. రోడ్ల గురించి ఒకరోజు ప్రత్యేకంగా చర్చిద్దామని హరీష్ చెప్పారు.

# ఎస్సీ కార్పొరేషన్ నిధుల కోసం నిరీక్షణ

# నిరాశలో అర్హులైన యువత

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి

- ఎస్సీ కార్పొరేషన్ నిధుల మంజూరుకై నాలుగేళ్ళ నిరీక్షణలో అర్హులకు నిరాశే మిగిలింది



దళిత కార్పోరేషన్ నుండి నిధులు విడుదల కాక,మంజూరీ లేక యువత నిరాశా నిస్పృహల్లో ఉందని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపించారు.దళిత యువతలో వృత్తి నైపుణ్యాలను గుర్తించి 2020-21 గాను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూ లలో అర్హత పొందిన యువతకు ప్రభుత్వం బ్యాంకులలో సబ్సిడీ రుణాలు మంజూరు చెక్ లు వేశారు తప్ప, నిధులు విడుదల చేయలేదని నాలుగేళ్ళ నిరీక్షణలో అర్హులైన యువతకు నిరాశే మిగిలిందని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపించారు.శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రం లోని టిఎవైఎస్ కార్యాలయంలో టిఎవైఎస్ జిల్లా అధ్యక్షులు కొంగర పవన్, టిపిఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షులు బోనగిరి మల్లారెడ్డి తో కలిసి పేట భాస్కర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలలో సెలెక్ట్ అయిన యువత రుణాలు మంజూరు అవుతాయని గంపెడు ఆశతో అప్పులు చేసి బ్యాంకులలో డిపాజిట్ లు చేశారని, ఇప్పటికి వడ్డీలు కడుతున్నారని జగిత్యాల జిల్లా లోనే దాదాపు నూట యాభై మంది అర్హులు వున్నారని ఇకనైనా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తారనే భరోసాలో వున్న యువతకు ప్రభుత్వం ఈమధ్యనే రాజీవ్ యువ వికాస్ పెరిట కొత్త పథకం ప్రారంభించడంతో ఇన్నాళ్లు గా నిధుల మంజూరు కై నిరీక్షించిన యువతలో నిరాశే మిగిలిందని అన్నారు.

కనీసం వారికి రాజీవ్ యువ వికాస్ లోనైనా మొదటి అవకాశం కల్పించాలని పేట భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాల వల్ల ఎస్సీ కార్పొరేషన్ ను పూర్తిగా నిర్వీర్యం చేసేలా వ్యవరించారని, గత నాలుగేళ్లుగా రుణాలు మంజూరు చేయక దళిత యువతను మోసం చేసారని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ కార్పోరేషన్ ద్వారా దళిత యువతను అదుకోవాలని పేట భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

# అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తినిచ్చే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి

- ఇబ్రహింపట్నం మండల మాజీ ఎంపీపీ నేరెళ్ళ దేవేంధర్



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభివృద్ధి, సంక్షేమాన్ని అకాంక్షిస్తూ రాష్ట్రబడ్జెట్ ప్రవేశపెట్టారని ఇబ్రహింపట్నం మండలకాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు, మాజీఎంపిపి నేరెళ్ళ దేవేంధర్ శుక్రవారం అన్నారు.ఈసందర్భంగా ఆయన తిమ్మాపూర్ గ్రామంలో మాట్లాడుతూ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై చిన్నారెడ్డిస్పందిస్తూ తెలంగాణా రాష్ట్రంలో గడ్డుఆర్థిక పరిస్థితులు వున్నప్పటికీ, వాటినిఅధికమించే విధంగా రూపాయలు 3,04,965 కోట్ల ప్రణాళికతో బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. బడ్జెట్ మహిళలకు, విద్యార్థులకు,నిరుద్యోగులకు, యస్.సి, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ది చేకూరేలా ప్రవేశపెట్టారని, వ్యవసాయ రంగానికి, రైతు భరోసాకు, నీటిపారుదల శాఖలకు పెద్దపీట వేసి రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధిని తెలిపిందని దేవేంధర్ పెర్కోన్నారు.

# వరుస ఘటనలు జరుగుతున్న మారని గోదావరిఖని 1-టౌన్ సీఐ దురుసు ప్రవర్తన...

- గోదావరిఖని 1- టౌన్ సిఐని వెంటనే సస్పెండ్ చేయాలి.
- రామగుండం సిపి,గోదావరిఖని ఏసీపి లు తక్షణమే స్పందించాలి.
- మానసిక పరిస్థితి బాగులేని సీఐ బాధితుల పక్షాన ఏం న్యాయం చేస్తాడు.
- ఘటనల మీద ఘటనలు జరిగిన అధికారులు పట్టించుకోరా.
- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం.




కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని గోదావరిఖని వన్ సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ బాధితుల పక్షాన సమస్య ఉందని సీఐ దృష్టికి తీసుకెళ్తే సమస్యను పరిష్కరించకుండా అసభ్యకరమైన పదజాలంతో తిడుతూ, నువ్వు ఎవడు, నువ్వు ఎందుకు వచ్చావు, నీ సమస్యనా,నీకు ఏం అవసరం, సమస్యను పరిష్కరించం ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ, అతనిని గింటేయండి అంటూ, నా అసలైన రూపం నీకు తెలువదు అంటూ హెచ్చరిస్తూ, బాధితుల సమస్యలను పరిష్కరించని, ఇష్టానుసారంగా ప్రవర్తించే సీఐ ని వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. మొన్నటికి మొన్న టిఆర్ఎస్ మహిళా కార్పోరేటర్స్ నాయకుల పై, యువ న్యాయవాది పై , దురుసుగా ప్రవర్తించిన ఘటన మరువకముందే మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం చేస్తున్నాడని, బాధితుల సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులే తన లక్ష్యంగా పెట్టుకొని , బాధితుల పక్షాన వెళ్ళిన ప్రతి ఒక్కరితో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆయన వాపోయారు. బాధితులతో సరిగ్గా మాట్లాడని,మానసిక పరిస్థితి బాగులేని సీఐని సైకాలజిస్ట్ కి చూపించాలని,గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఎచ్.ఓ కి సిఐ అనర్హుడని ఆయన అన్నారు. బాధితుల పక్షాన వెళ్లిన ప్రతి ఒక్కరితో అసభ్యకరమైన పదజాలంతో,దురుసుగా ప్రవర్తిస్తున్న సిఐ పై రామగుండం సిపి,గోదావరిఖని ఏసీపి లు తక్షణమే చర్యలు తీసుకోని, సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి శనిగారపు చంద్రశేఖర్,ఏఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, ధనాల ఉదయ్, సాంగే రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవో కార్యాలయంలో అవినీతి సొమ్ము !

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి

- జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో ఐటి అధికారుల సోదాలు

జిల్లా హెడ్ క్వార్టర్ లో నిన్న 9 గంటల పాటు ఐటీ సోదాలు కొనసాగాయి. వివరాల్లోకి వెళ్తే 2019లో భూ నిర్వాసితుల పరిహారం పంపిణీలో అవకతవకలు గుర్తించిన ఐటీ అధికారులు, నిబంధనలకు విరుద్ధంగా కోటి రూపాయలు పైగా చేతులు మారినట్లు అందిన సమాచారంతో అధికారులు సోదా చేసారు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఐటి అధికారులు కేసులు చేయనున్నట్టు తెలిసింది.

# పరీక్షా కేంద్రం పరిశీలించిన కలెక్టర్



ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి

- పరీక్ష కేంద్రం కలెక్టర్ పరిశీలన

కోరుట్ల పట్టణం లో SFS స్కూల్ పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గారు పరిశీంచారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కలిపించి పరీక్షలు సజావుగా జరిపించాలని సిబ్బందిని కోరారు. వారితో పాటు ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిపై మెడికల్ విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్







**కరపత్రం న్యూస్ జగిత్యాల: మార్చి21**

మార్చి 24వ తారీఖున జరిగే ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో విద్యార్థులకు క్షయ వ్యాధి పై క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్ రావు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్ మోహన్ రావు, జిల్లా క్షయ వ్యాధి నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్ శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన విద్యార్థులకు క్షయ వ్యాధి, లక్షణాలు అది వ్యాపించే విధానం బ్యాక్టీరియాను పరీక్షించే విధానాల గురించి, చికిత్సల రకాలు డ్రగ్ సెన్సిటివ్ టిబి , డ్రగ్ రెసిస్టెన్స్ టీబి పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకొని ప్రజలలో మరియు కుటుంబ సభ్యులలో అవగాహన కల్పించాలని, ఎవరికైనా లక్షణాలు కనిపించినట్లయితే హాస్పిటల్కు పంపించి చికిత్స తీసుకునే విధంగా తోడ్పాటు నందించాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నీతూ, డాక్టర్ సుమలత, డాక్టర్ పవన్, డాక్టర్ ప్రవీణ్ విద్యార్థులను 10 గ్రూపులుగా విభజించి క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో విజేతలైన వారికి మార్చి 24 నాడు జరిగే వరల్డ్ టీబీ డే కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, మరియు తృతీయ బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, టీబి లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్ శ్రీనివాస్, జి జి హెచ్ ఇంచార్జ్ సూపర్నెంట్ డాక్టర్ సుమన్, వైద్య కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్, ఎమ్మెస్ డబ్ల్యూ తుంగూరి వెంకటేషం,హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్ ,తరాల శంకర్ ,డి పి పి ఎం హరీష్ ,సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ,బిసి రిజర్వేషన్ల అమలుపై కోరుట్లలో కాంగ్రెస్ వేడుకలు



ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి


- కోరుట్ల కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఈరోజు జువాడి నర్సింగరావు గారు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణ మరియు మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో బీసీ రిజర్వేషన్ 42% మరియు ఎస్సీ వర్గీకరణ బిల్లులు అసెంబ్లీలో చట్టబద్ధంగా ఆమోదించిన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ చేసి తదనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కాంగ్రెస్ పార్టీ అధినేత గౌరవ శ్రీ రాహుల్ గాంధీ గారికి మరియు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారికి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ గారికి, పొన్నం ప్రభాకర్ గారికి, ఉత్తంకుమార్ రెడ్డి గారికి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి ధన్యవాదాలు తెలిపి,వారి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసి, స్వీట్ పంపిణీ చేస్తూ సంబరాలు నిర్వహించారు.

# మహిళా రైతులకు అందుబాటులో వ్యవసాయ పనిముట్లు.

- మల్లాపూర్ మండల వ్యవసాయ అధికారిని లావణ్య.

**కరపత్రం మల్లాపూర్. మార్చి 21.**



సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మేకనైజేషన్ స్కీం కింద మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నట్టు మల్లాపూర్ మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. ఇట్టి పనిముట్లను మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పనిముట్లవివరాలు : బ్యాటరీ స్ప్రేయర్స్ 8, పవర్ ఆపరేటర్ స్ప్రేయర్స్ 8, రోటోవేటర్స్ 4, కల్టివేటర్స్ 5, పనిముట్ల కొరకు మహిళా రైతులు వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే దరఖాస్తు కావాల్సిన పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో కూడిన అప్లికేషన్ ఫారం ను సమర్పించగలరని తెలిపారు.

# ప్రారంభమైన పది పరీక్షలు...

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో భాగంగా బోధన్, సాలూర మండలంలో ఏర్పాటు చేసిన 13 కేంద్రాలలో శుక్రవారం 3168 మంది విద్యార్థిని,విద్యార్థులకు గాను 3162 మంది విద్యార్థిని,విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాధికారి నాగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 గురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శనివారం మార్చి 22 2025

# అసెంబ్లీకి సీఎంతో కలిసి వెళ్లిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది



రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, రామగుండం నియోజకవర్గ సమస్యలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సింగరేణి కార్మికుల సమస్యలు, మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసులు, రామగుండం పారిశ్రామికాభివృద్ధి, పట్టణ ప్రగతి, రోడ్లు, డ్రైనేజీ, గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్య సేవల విస్తరణ వంటి ముఖ్య అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అసెంబ్లీలో చర్చలు జరపడం, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు ఉన్నారు.

# రాములోరికి గోటి తలంబ్రాలు..!

- ఒడ్లు ఒలిచిన శ్రీ సీతారామ సేవా సమితి మహిళలు
- శనివారం భద్రాచలం సీతారామాలయంలో అప్పగింత

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది



పెళ్ళిళ్లలో వాడే తలంబ్రాల కోసం సాధారణంగా మామూలు బియ్యాన్ని ఎవరైనా వాడతారు అదే సీతారాముల కళ్యాణమైతే ఆ తలంబ్రాలకు విశిష్టత, సాంప్రదాయపు సొబగులు అద్దాలి కదా% అందుకే సాక్షాత్తూ కృతయుగంలో సీతారాముల వారి కళ్యాణం కోసం తలంబ్రాలు ఎలా సిద్ధం చేశారో... ఇంచుమించు అదే భక్తిభావనతో, అకుంఠిత దీక్షతో తలంబ్రాలు తయారు చేసి భద్రాచలంలోని శ్రీరాముల వారి ఆలయానికి భక్తులు పంపించడం గత కొన్ని శతాబ్దాలుగా ఓ ఉద్యమంలా నిర్వహిస్తున్నారు భక్తులు. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలోని శ్రీ సీతారామ సేవా సమితి నుంచి కూడా ప్రతి ఏడాది పెద్ద ఎత్తున తలంబ్రాలు తయారుచేసి పంపిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఒక మహా క్రతువులా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏప్రిల్ 6న శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ కళ్యాణోత్సవాలకు సాంప్రదాయబద్ధంగా శ్రీ సీతారామ సేవా సమితి మహిళలు గోటితో ఒలిచిన తలంబ్రాలను పంపించి రామభక్తులు తమ భక్తిని చాటుకుంటున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే గోటితో కోటి తలంబ్రాలను ఒలిచే కార్యక్రమాలకు శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీపీసీలో శ్రీకారం చుట్టారు.

**తలంబ్రాలు చేయడంలో ప్రత్యేకత**

తలంబ్రాలు తయారు చేయడమంటే ఒడ్లు తెచ్చి రైస్‌మిల్లులో వేసి బియ్యం వేరు చేయడం కాదు సుమా. ఇలా చేస్తే ఇక భక్తులకు కలిగే మహాభాగ్యం ఏముంటుంది. అందుకే కృతయుగంలో ఏ విధంగా ఒడ్లను గోటితో వలిచి బియ్యాన్ని వేరు చేస్తారో.. సరిగ్గా అలాగే గోటితో వలవాలి. అన్నీ ఒకే చోట నుంచి కాకుండా ఈ మహద్భాగ్యంలో వీలయిన ఎక్కువ ప్రాంతాల నుంచి తయారుచేసేలా చూసుకుంటారు. అందులో భాగంగానే భద్రాద్రి రామయ్య కళ్యాణానికి గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ శ్రీ సీతారామ సేవా సమితి రామభక్తులు తమ వంతు ఉడతా భక్తిగా కోటి తలంబ్రాలను గోటితో వలిచి సిద్ధం చేస్తున్నారు.

**వడ్లు తెప్పిస్తున్న భూపాలపల్లి తిరుపతి, తిరుపతమ్మ**

బద్రచలం శ్రీ సీతారాముల కళ్యాణం కోసం తలంబ్రాల వడ్లు భూపలపల్లికి చెందిన రామదాసు తిరుపతి–తిరుపతమ్మ దంపతులు స్వహస్తాలతో పండించి, ఆ వడ్లను భద్రాచలం శ్రీరాములోరి సన్నిధిలో పూజ చేసిన అనంతరం ఎన్టీపీసీ శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులకు పంపించారు. ఈ వడ్లు శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు ఒలిచి, తలంబ్రాలుగా చేస్తున్నారు. శనివారం భూపాలపల్లి రామదాసు తిరుపతి అద్వర్యంలో భద్రాచలం ఆలయం ఈవోకు అప్పగించనున్నట్లు చంద్రకళ తెలిపారు. ఈ అదృష్ట భాగ్యం కలిగించిన రామదాసు తిరుపతికి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు గోలివాడ చంద్రకళ, కంది సుజాత, కొండు రమాదేవి, జనగాం రాజేశ్వరీ, ఆలయ కమిటీ చెప్యాల సత్యానారయణరావు, పాల్గొన్నారు.

# మార్కండేయ శివాలయంలో భద్రాద్రి రామునికి తలంబ్రాలు వలిచే కార్యక్రమం

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది



గోదావరిఖని మార్కండేయకాలనీలోని మార్కండేయ శివాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మన చేతితో మనమే వడ్లను ఓలిసిన తలంబ్రాలను మన భద్రాద్రి రామయ్యకు సమర్పించాలని ఉద్దేశంతో 108 మంది ముత్తైదువులతో వడ్లను ఒలిసే కార్యక్రమం నిర్వహించారు. ఈ తలంబ్రాలను రేపు భద్రాచలంలో అప్పగించడం జరుగుతుంది. దేవదేవుడైన భద్రాద్రి రామయ్యకి గోదావరిఖని పట్టణంలో మార్కండేయ శివాలయంలో ఈ కార్యక్రమం చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. రామనామ స్మరణతో 108 మంది ముత్తైదువులతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దుర్గా వాహిని మాతృశక్తి జిల్లా సహా సమయోజక అన్నపూర్ణ, ఇంద్ర, వీహెచ్పీ సభ్యులు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంచి కట్ల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి బండారి రాజమల్లు, ఉపాధ్యక్షులు తాటిపాముల రాజేష్, లెంకల రాజిరెడ్డి, తోకల మల్లయ్య, బోయిరి కొమరయ్య, బత్తుల నారాయణ, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

# "మెర్గు కుమార్ కుటుంబానికి అండగా సంఘం ఉంటుంది:

- రాష్ట్ర గౌడ సంఘం నేత సింగం సత్తయ్య:

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది



అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి చౌరస్తాలో ముర్మూర్ నుంచి మట్టి తరలిస్తున్న లారీ ఢీకొని మృతి చెందిన పెద్దంపేటకు చెందిన ఐకెపి రిసోర్స్ పర్సన్ మెర్గు కుమార్ గౌడ్ కుటుంబానికి తమ గౌడ సంఘాలు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తాయని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఫౌండర్ సింగం సత్తయ్య గౌడ్ ,గౌరవ సలహాదారు కోలా లక్ష్మణ్ గౌడ్ అన్నారు. కుమార్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యుల ఓదార్చిన అనంతరం వారు మాట్లాడారు... ఇప్పటికే కుమార్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని మద్దతునిస్తూ గొంతు విప్పిన అందరికీ తమ సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతూ, పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు మద్దతుగా నిలవాలని సింగం సత్తయ్య గౌడ్, కోల లక్ష్మణ్ గౌడ్ కోరారు. అతి నిరుపేద స్థితిలో ఉన్న కుమార్ గౌడు కు భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లి, కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి కడుదీనంగా ఉందని వారు పేర్కొన్నారు. కుమార్ గౌడ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు భార్యా, పిల్లలకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వ అధికారులను, రామగుండం ప్రాంత ప్రజా ప్రతినిధులను ఈ సందర్భంగా కోరారు. లేనిపక్షంలో కుమార్ గౌడ్ మృతికి కారణమైన మట్టి కాంట్రాక్టర్ ఇంటి ముందు భార్య పిల్లలు కుటుంబ సభ్యులతో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చే గౌడ సంఘాల నేతలతో శాంతియుత ఆందోళన కార్యక్రమాలు చేపటచట్టక తప్పదని వారు ప్రకటించారు.

# పోలీస్ కమిషనర్ ను కలసిన టీడబ్ల్యూజెఎఫ్ నాయకులు

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది



కరీంనగర్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలం ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో అవినీతి, అక్రమాలను అరికట్టాలని సీపీ ని కోరారు. కరీంనగర్ ను నేర రహిత జిల్లా గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా సీపీ కి విజ్ఞప్తి చేశారు. పోలీస్ కమిషనర్ ను కలసిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శి జి. కిరణ్, నాయకులు ఎల్ సురేష్ లు ఉన్నారు.

# సంక్షేమాదికారులతో సమీక్ష సమావేశం

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది



ఆర్జి 1 ఏరియాలోని గనులు, డిపార్ట్ మెంట్స్ లలో పని చేస్తూ గైర్హాజర్ ఉద్యోగుల గురించి, సిఏంపిఎఫ్ నామినేషన్లు పెండిగ్ కారుణ్య నియామక ఉద్యోగాలు, టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులపై అన్ని గనుల సంక్షేమాదికారులతో డిజిఎం పర్సనల్ దేవరకొండ కిరణ్ బాబు, పర్సనల్ అధికారులు సంక్షేమాదికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్జి 1 ఏరియాలోని కార్మికులకు సంబందించిన పలు అంశాల గురించి చర్చించారు. పదవి విరమణ పొందిన ఉద్యోగుల టర్మినల్ బెన్ ఫిట్స్ చెల్లింపు, పెన్షన్ సంబంధిత సమస్యలు, ట్రాన్స్ ఫర్ విధులకు గైర్హాహాజరు అవుతున్న కార్మికులకు సంబందించిన కౌన్సిలింగ్ వివరాలు, హాజరు శాతం పెంచుటకు చేపట్టవలసిన ప్రణాలికలు, సి.ఏం.పి.ఎఫ్ నామినేషన్స్, కారుణ్య నియమకాలు, క్వార్టర్ అలాట్ మెంట్, కోర్ట్ కేసుల వివరాలు, బదిలీలకు సంబందించిన, అర్జీ.1 లోని ఇతర పర్సనల్ డిపార్ట్ మెంట్ కు సంబందించిన, ఉద్యోగులకు చెందవలసిన సంక్షేమ సదుపాయాలు, బెన్ ఫిట్స్ గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పి.ఓ సారంగపాణి, హనుమంత రావు, సంక్షేమ అధికారులు రవీంధర్, గణేశ్, ఇక్బాల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎగ్జామ్ సెంటర్ లో అస్వస్థతకు గురైన విద్యార్థి:

- తక్షణమే ప్రథమ చికిత్స అందజేసిన డాక్టర్ ఉదయ్ కిరణ్:

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ అంతర్గాం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు జరిగే సెంటర్లో బోడకుంట నందన్ వర్మ అనే బ్రాహ్మణ పెల్లి గ్రామానికి చెందిన విద్యార్థి వాంతింగ్ చేసుకొని అస్వస్థత కు గురి కావడం జరిగిందని తెలుసుకున్న అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉదయ్ కిరణ్ తక్షణమే అక్కడికి చేరుకొని ఆ విద్యార్థికి ప్రథమ చికిత్స అందించి యధావిధిగా పరీక్ష రాయించడం జరిగింది. అనంతరం పరీక్ష ముగించుకుని అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ ఉదయ్ కిరణ్ అత్యవసర అంబులెన్స్ లో తాను స్వయంగా విద్యార్థిని తీసుకువచ్చి హాస్పిటల్లో ట్రీట్మెంట్ చేసి మరుసటి రోజు యధావిధిగా పరీక్ష రాసే విధంగా విద్యార్థికి ట్రీట్మెంట్ అందించి వారి కుటుంబ సభ్యులతో ఇంటికి పంపించడం జరిగింది. ఇలాంటి అత్యవసర చికిత్స అందించి మానవత్వం చాటుకున్న డాక్టర్ ఉదయ్ కిరణ్ కు విద్యార్థి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నగరంలోని బేకరీలు, స్వీట్ షాపులలో తనిఖీలు

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది



పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి నేతృత్వంలో రామగుండం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం అధికారులు శుక్రవారం నగరంలోని బేకరీలు, స్వీట్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. నాణ్యతా లోపంతో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్న ఒక బేకరీ, మరొక స్వీట్ షాపు నుండి రూ.20,000 జరిమానాగా వసూలు చేశారు. అలాగే మరో బేకరీ నుంచి నిషేధిత ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించినా, నిషేధిత ప్లాస్టిక్ సంచులు వినియోగించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ తనిఖీలలో సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఎస్సీఆర్ జిఎం అరుణ్ కుమార్ జైన్:

- స్వాగతం పలికిన రామగుండం బిజెపి ఇన్చార్జి కందుల సంధ్యారాణి:
- రైల్వే స్టేషన్ లో కావలసిన సౌకర్యాలపై జీఎం కు సంధ్యారాణి మెమోరాండం:

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది





పెద్దపల్లి జిల్లా రామగుండం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా రామగుండం రైల్వే స్టేషన్ లో జిఎం అరుణ్ కుమార్ జైన్ ను రామగుండం బిజెపి ఇన్చార్జి కందుల సంధ్యారాణి స్వాగతం పలికారు. అనంతరం రైల్వే స్టేషన్ లో కావలసిన సౌకర్యాలపై జిఎం కు సంధ్యారాణి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతు..... కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం నిధులతో రైల్వే స్టేషన్ల సుందరీకరణ కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించిందని... రైల్వే స్టేషన్లను ఎయిర్ పోర్టుల తరహాలో తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని సంధ్యారాణి తెలిపారు. రామగుండం రైల్వే స్టేషన్ సుందరీకరణ కోసం 30 కోట్ల నిధులను ప్రధాని నరేంద్ర మోడీ కేటాయించినట్లు ఆమె వివరించారు. మాన్ చెస్టర్ ఆఫ్ ఇండియా గా పిలవబడే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇతర రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తారన్నారు. రామగుండం రైల్వే స్టేషన్ లో అన్ని సూపర్ ఫాస్ట్ ట్రైన్లను ఆపేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఆమె జీఎంను కోరారు. కన్నాల, కుందనపల్లి, పెద్దంపేట్ రైల్వే గేట్ల వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ సమగ్ర అభివృద్ధి కోసం పనిచేస్తుందని ఆమె కొనియాడారు. అభివృద్ధి పనులపై జిఎం అరుణ్ కుమార్ జైన్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.